జీవితమునకు ఒక లక్ష్యమున్నది. లక్ష్యమును గుర్తించి వర్తించటము మానవునకు అత్యవసరము. జీవితము అశాశ్వతమని భావించరాదు. దేహము అశాశ్వతముగాని జీవితము శాశ్వతము. కాని సత్యమైన జీవితమును, ఆదర్శవంతమైన జీవితముగాను నిరూపించాలి. అనిత్యమైన దేహ తత్త్వము అనిత్యమేగాని సత్యనిత్యమైన జీవిత తత్త్వము శాశ్వతమైనది కనుక ఆదర్శముగా దానిని అనుభవించాలి. ఈ నాటి విద్యార్థులు ఆదర్శప్రాయులుగా నిల్వాలి. త్యాగమూర్తులుగా తయారు కావాలి. సత్య ధర్మ పరాయణులు కావాలి. ఆధ్యాత్మిక భావమును అనుష్ఠించాలి. అన్ని మార్గములకంటె ఆధ్యాత్మిక మార్గము అత్యంతోత్తమమైనది. 'విద్యానాం ఆత్మవిద్య' అని. అన్ని విద్యలకంటె ఆత్మవిద్య చాలా ఉత్తమమైనది. అన్ని విద్యలు నదుల వంటివి. అన్ని విద్యల మూలము, గమ్యము, కలక స్థానము ఆధ్యాత్మిక విద్య. ఆధ్యాత్మిక విద్య సముద్రము వంటిది. అన్ని విద్యలు నదుల వంటివి. 'నదీనాం సాగరో గతిః' అన్ని నదులకు గమ్యము సాగరమే. నైతిక భౌతిక ఆధ్యాత్మిక లౌకిక వైజ్ఞానిక మార్గములన్నింటికి ఆధ్యాత్మికమే గమ్యము. ఇట్టి భవ్యమైన దివ్యమైన మార్గమును అనుసరించిన వ్యక్తులు భారతదేశములో అనేకమంది వుంటున్నారు. పిల్లలు చెప్పారు జయదేవుని విషయము మాకు తెలియదని.

జయదేవుడనగా తన జీవితమును జయించినట్టి దేవుడే. ఇతడు West Bengal లో పుట్టినవాడని కొందరు ఒరిస్సాలో పుట్టినవాడని కొందరు విభేదిస్తారు. ఈ విధంగా మహనీయుల తత్త్వమును గూర్చి చర్చలతో కాలము గడుపుతూ వుంటారు. పుష్పము ఎక్కడుంటే మనకేమి దాని సుగంధము మనము అనుభవించాలి. అతడెక్కడ పుట్టినప్పటికి అతని ఆధ్యాత్మిక సుగంధము జగత్ వ్యాప్తిగా వ్యాపించింది. నిజముగా అతని చరిత్రను విచారణ చేసుకుంటే ఒరిస్సా దేశములో పూరీ అనే పట్టణము సమీపములో బిల్వగ్రామమనేది ఒకటి వుండేది. ఆ బిల్వగ్రామములో భోజదేవుడు అనే మధ్యతరగతి బ్రాహ్మణుడుండేవాడు. ఇతని భార్య రమాదేవి. వీరు ఇద్దరు ఆ గ్రామములో ఆధ్యాత్మిక మార్గమును అనుసరిస్తూ దైవచింతనలో కాలము గడుపుతూ వుండేవారు. ఈ పుణ్యదంపతుల పుణ్యపుత్రుడే జయదేవుడు. ఇతను పుట్టినప్పటి నుండి అతని హృదయము భగవత్ మార్గములోనే ప్రవేశిస్తూ వచ్చింది.

ఇతనికి నవవిధ భక్తుల లోపల మధుర భక్తి చాలా ప్రీతి. ఇతని అభిప్రాయమేమనగా జగత్తులో పురుషులనేవారు ఎవ్వరు లేరు. అందరూ అబలలే. భగవంతుడొక్కడే పురుషుడు అనే విశ్వాసము అతనియందు గాఢముగా నాటుకొని పోయింది. అనగా అతని ఉద్దేశ్యమేమిటి? పురుషుడనగా బుష్ కోటు, ప్యాంటు, పంచ యిలాంటివి కట్టినంత మాత్రమునే పురుషుడా? నిగ్రహాన్ని కలవాడు, ఆత్మతత్త్వాన్ని అనుభవించేవాడు పురుషుడని.

రోషంగానీ, తాపంగానీ, ఆకలి గానీ, ఆనందముగానీ సమానంగా అందరికి వుంటున్నది. దుఃఖము వస్తే ఆడవారు ఏడుస్తారు, మగవారు ఏడుస్తారు. ఆకలి వేస్తే మగవారు తింటారు ఆడవారు తింటారు. ఇందులో మగవారి వత్యాసము ప్రత్యేకంగా కనిపిస్తుందా? వారియందు ఈ అబలత్వము వుంది. వీరియందు అబలత్వము వుంది. అబలత్వమనగా ఏమిటి? ఇంద్రియ నిగ్రహము లేకపోవుటయే అబలత్వము. అది మగవారికి కూడా పోదు. ఇది కేవలం శారీరక బేధములే గానీ మానసికంగా యిద్దరూ సమానమే. కనుక అందరూ అబలలే ఈ జగత్తులో. అందరూ దుర్బలులే ఈ జగత్తునందు. ఒక్క కృష్ణుడు మాత్రమే బలుడు. అతడే పురుషుడు. అతనిని పొందటమే ప్రధానమైన లక్ష్యము. ఇట్టి విశ్వాసమును జయదేవుడు హృదయములో భద్రము చేసుకున్నాడు.

ఆ రాజ్యమును పాలిస్తూ వుండేవాడు లక్ష్మణసేనుడు. ఈ లక్ష్మణసేనునకు జయదేవుని యొక్క భక్తిప్రపత్తులు చాలా నచ్చినవి. ఇతను కేవలం భక్తుడు మాత్రమే కాదు కవి కూడను. కవులనగా కేవలం కొన్ని పదములను పొందిక చేసి ఏదో పద్యములు వ్రాయటం కవిత్వముగా భావిస్తారు. కాని జయదేవుడు అటువంటి వాడు కాదు. కవి అనగా త్రికాలజ్ఞాని యే. త్రికాలముల యొక్క విషయములను గుర్తించినవాడు కవి. పురాణం అనగా ఏమి? రామాయణము, భాగవతము యిత్యాది పురాణములు కాదు. క్షణములో నఖశిఖపర్యంతము సంచరించే వాడే పురాణం. అనగా సర్వజీవులందు, సర్వదేహములందు సమత్వముగా సంచరించేవాడు పురాతనమైన వాడు పురాణుడు. ఇతను భగవంతుడే. అనుశాసితుడనగా ఎప్పుడు ఏదైనా తప్పు చేస్తే జైలులో పెడతారు. అతని శరీరమును బంధించేగానీ మనస్సును బంధించటానికి ఏ అధికారికి సాధ్యం కాదు. దేహము జైలులో వుంటున్నదిగానీ అతని మనస్సు అంతా తిరగవచ్చు అతని యింటికి వెళ్ళవచ్చు. అన్నివిధాల యోచించవచ్చు. ఫ్రెండును బయటకు పంపించకుండా చేయటానికి ఎవరికీ అధికారము లేదు. కాని అట్టి మనసును కూడను అరికట్టి దానిని బంధించే వాడు భగవంతుడే. కనుక అతనే అనుశాసితుడు. కవి, పురాణుడు, అనుశాసితుడు ఈ మూడు భగవంతుడే గాని అన్యులు కాదు.

అట్టి పురాణపురుషుడైన భగవంతుడు ఒక్క కృష్ణుడు తప్ప అన్యులు కాదు అని చెప్పాడు. ఏది ప్రారంభించినా కృష్ణా అని ప్రారంభించి తదుపరి ఈ పదములనంతా పొందిక పరచేవాడు. ఇతని కవిత్వము కూడను చాలా మధురము. ఇతనిది మధుర భక్తి కనుక యితని పదములు కూడను మధురముగానే పాడేవి.

నయనం మధురం వచనం మధురం
సర్వం మధురం మధురాధిపతే మధురం మధురం.

అతని హృదయమంతా మధురత్వముతో నిండిపోయింది. పాత్రలో తీయని పాయసం పోసి పెట్టి ఎన్ని రంధ్రాలు కొట్టినాగానీ అన్ని రంధ్రములనుండి పాయసమే వస్తుంది గానీ మరొక పదార్థము రాదు. అదే రీతిగా హృదయము అనే భాండమందు మధురమైన భగవత్ప్రేమను నింపుకున్న జయదేవునకు అన్నింటియందు మధురంగానే వస్తూ వచ్చాయి. ఎట్టి భావమో అట్టి కర్మను ఆచరిస్తారు. ఇప్పుడు ఒక బావిలో వున్న రాయిని వేశామంటే అనేక అలలు బయలుదేరతాయి

ఆ అలలు ఎంతవరకు పోతాయి. బావి ఎంత వరకు విశాలంగా వుందో అంతవరకు పోతాయి. మనకు కనుపించినా కనుపించకపోయినా ఆ అలలు అంతవరకు చేరుతాయి. అదే రీతిగా యీ మానస సరోవరంలో ఎలాంటి thoughts అనే రాయి వేసినా అది సర్వత్ర వ్యాపించిపోతుంది. అందులో bad thought అనే stone వేస్తే bad waves బయలుదేరి పోతాయి. ఆ బయులా ఎంతవరకు పోతాయి కన్నులలోకి పోతాయి, చెవులలోకి పోతాయి. నోటిలోకి పోతాయి, చేతులలోకి పోతాయి, పాదములలోకి పోతాయి సర్వత్ర వ్యాపించి పోతాయి. అదే పవిత్రమైన భావమే మన హృదయములో వస్తే అది కూడను యీ దేహములో సర్వాంగములలోనూ ప్రవేశిస్తుంది. కనుకనే యద్భావం తద్భవతి. ఎట్టి భావమో అట్టి ఫలితమును పొందుతుంది. కనుక మంచి భావాన్ని పెంచుకోవటం సరియైన స్థితి అని యితను చాటుతూ వచ్చాడు.

ఈ కవిత్వములో మధుర భక్తిని లీనంగా విస్తూ వచ్చాడు. అతనిని లక్ష్మణసేనుడు ఆస్థాన పండితుడుగా నియమించుకున్నాడు. ఆయొక్క సభలలోపల వచ్చే పండితుల కంటె యితను చాలా ఉత్తమమైన వాడుగా రాజకవి అని బిరుదు యిచ్చాడు. కాని యీ పదమునకు తాను యేమాత్రము లొంగలేదు. ఇతను వ్రాసుకుంటూ ఆనందమును అనుభవిస్తూ పోతున్నాడు. అదే గ్రామములో ఒక జగన్నాథ భక్తుడు వుండేవాడు. అతనికి బిడ్డలు లేక చాలా తపిస్తూ వుండేవాడు. అతడు జగన్నాథుని ప్రార్థించాడు. జగన్నాథా! నాకొక కుమారుని ప్రసాదించు లేక కుమార్తెను ప్రసాదించు పుత్రులు లేని జీవితం పున్నామ నరకమంటారు. కనుక పవిత్రమైన స్థాయిని అందించమన్నాడు. కొంతకాలమైన తరువాత అతనికి పుత్రిక కలిగింది. ఆమెను పెంచి పెద్ద చేశాడు. 'స్వామి! నీవిచ్చిన ప్రసాదము నీకే అర్పితమని స్వామికి అర్పితము గావించటానికి వెళ్లాడు. ఆనాటి రాత్రి జగన్నాథుడు ఆ వ్యక్తి స్వప్నంలో వచ్చి నాయనా నేను అనుగ్రహించిన దానిని నాకె వెనుకకు యివ్వటం తగినది కాదు. నా పరమ భక్తుడు ఒకడున్నాడు. అతనికి యివ్వమన్నాడు. అతనే జయదేవుడు. జయదేవుని దగ్గరకు వచ్చి నాయనా నా బిడ్డను నీకు అర్పితము చేస్తున్నాను. ఇది జగన్నాథుని ఆజ్ఞ అన్నాడు. జగన్నాథుని ఆజ్ఞను నాకు సర్వులకు శిరసావహించ వలసినదే. కాని నేను అట్టిస్థితిలో లేను. నేను చాలా బీదవాడిని. నా పరిస్థితులు నీకు తెలియవేమో. అలాంటి బీద కుటుంబమునకు నీ బిడ్డనిచ్చి బాధపెట్టటం ధర్మం కాదన్నాడు. నాకు ధనము, వైభవములు నాకక్కరలేదు. దైవ భక్తి అనే పరమ ధనమే నాకు ప్రధానమన్నాడు. కనుక అట్టి పరమ భక్తి కలిగిన వాడవు కనుక నీవే శ్రీమంతుడవు. అంతకంటె గొప్పవారు యీలోకములో వున్నారా? రాజులకు రాజు మహారాజ రాజు భగవంతుని స్వాధీనము చేసుకున్నవాడవు నీకంటె గొప్పవారు ఎవరున్నారు. రెండవ జవాబు కోసం నేను కాచుకోవటం లేదు. యిదుగో యికపై వదలి వెళ్లి పోతున్నాను అన్నాడు. వదలి వెళ్లిపోయాడు పద్మావతి అక్కడే నిల్చిపోయింది. తిరిగి చూచాడు పద్మావతిని. 'అమ్మా! యీ బీదవాని కోసం ఎందుకింత తపిస్తున్నావు?' ఆ పద్మావతి చెప్పింది. 'నేను యింక యింటికి పోదలచుకోలేదు. నీవు ఎక్కడికి వెడితే

ఎక్కడికి నీవెంటనే వస్తాను. మీరు యేమి చెబితే అది నేను వింటాను. నాకు వేరుగతి లేదు. నీ సన్నిధే నా పెన్నిధి'.

ఇలాంటి పవిత్రమైన స్థితి నా జన్మములో ప్రాప్తించటము దీనిని నేను ఏనాటికి వదలిపెట్టను. నీకూ నాకు ఇంతరువురికి ఆత్మసృష్టి దేవాక్షి. ఈ విధంగా పద్మావతి పలికే పలుకు పలుకు జయదేవుని హృదయం కరిగి పోయింది. నేనే భక్తుడను అనుకున్నాను. నాకంటె మించిన భక్తురాలు యీ కన్య అనుకున్నాడు. ఈ విధంగా కాలం గడుస్తూ గడుస్తూ వారిద్దరి వివాహం జరిగి పోయింది. కానీ నిరంతరము వారి పని యేమిటి? జయదేవుడు పాడటము పద్మావతి నృత్యము చేయటం. ఈ విధంగా గృహమంతా భక్తి ప్రపత్తుల యొక్క vibration వ్యాపించి పోయింది. వారికి ఆహార నిద్రలు లేవు. ఇలాంటి దాంపత్యమనేది ఎన్ని జన్మల అదృష్టమో అని ఆ ఇరుగు పొరుగు వారు ఎంతో ఆనందిస్తూ వచ్చారు. ఈ వార్త లక్ష్మణ సేనునికి తెలిసింది. మహారాజు యొక్క భార్య మహారాణి పద్మావతిని యింటికి పిలిపించు కొంది. నిత్యము ఆమెతో మాట్లాడటము ఆమె సమావేశములో ఆనందము అనుభవించటము. యీ విధంగా కాలము గడుపుతూ వచ్చింది మహారాణి. పద్మావతి కూడను అనవసరమైన మాటలు ఒక్కటైనా మాట్లాడేది కాదు. ఏ మాట చెప్పినా ఏ ఆటలాడినా ఏది పలికినా కృష్ణుని పలుకులే. కృష్ణుని భావమంతే. కృష్ణుని చరిత్రలే. మహారాణి కూడను బాగా మారింది. ఈ విధముగా వుండగా మహారాణి పద్మావతితో సంభాషణ చేస్తూ కంట నీరు పెట్టింది. ఎందుకు మీరు కంటనీరు పెడుతున్నారని పద్మావతి ప్రశ్నించింది. 'మా బావగారు మరణించారు. ఆ వార్త వచ్చింది. అందువల్ల నేను దుఃఖిస్తున్నాను' అంది. అప్పుడు పద్మావతి చెప్పింది 'జనన మరణాలు యీ దేహమునకు సహజములు. పుట్టిన దేహము గిట్టక మానదు. ఇది కేవలము నీటి బుడగ. దీనిని ఆధారము చేసుకుని మన జీవిత గమ్యానికి మనం ప్రయాణం చెయ్యాలి. దేహము కూడను కాలాను గుణంగా కదలి పోతూ వుంటుంది. ఇంత మాత్రమునకు మీరు బాధ పడటం న్యాయము కాదు రాణిగారు' అంది. అప్పుడు పద్మావతిని చూచి కొంచెం ధైర్యం వచ్చి 'పద్మావతీ మా బావగారు మరణించటంలో నాకు దుఃఖము లేదు గానీ ఆనాటి సాంప్రదాయము పురస్కరించుకొని మా అక్కగారు చితిలో సహగమనము గావించింది. నిండు ప్రాణములతో అగ్నిలో ప్రవేశించింది. ఆ సహగమన దృశ్యమును నేను చూడలేక పోయాను. అది జీవితము లేని దేహము. ఇది పంచప్రాణములతో కూడిన దేహము. ఈ ప్రాణముతో వున్న దేహము అగ్నిలో మరణించటమంటే ఎంతకష్టంగా వుంటుంది'. ఈ విధంగా చెప్తూ వుంటే పద్మావతి చిరునవ్వు నవ్వింది. 'పద్మావతీ! నీకు దుఃఖము కలగటం లేదా? ఈ విధంగా నీవు నవ్వుతున్నావు' అని రాణిగారు ప్రశ్నించారు.

'అమ్మా పతి మరణించినాడంటే ఆ వార్త వినగానే సతి కూడను ప్రాణం వీడాలి. సహగమనం చేయటం సాహసమేగానీ సహజము కాదు' అనింది పద్మావతి. ఇది త్యాగము కాదు. యిది స్త్రీ సహజము. ఇది కేవలము ఒక సహజము. బలవంతపు చావు మంచిది కాదు. ఆ మాటతో రాణిగారికి చాలా కోపం వచ్చింది. నా అక్కగారు

చేసిన విషయం పద్మావతి ఒప్పుకోలుం లేదని కోపం వచ్చింది. ఈ [illegible] క్రమ క్రమేణా ఒక ద్వేషముగా మారుతూ వచ్చింది. కొంత సేపయ్యాక 'పద్మావతీ నీవు యింటికి వెళ్ళు నాకు తల నెప్పిగా వుంది' అనింది. సరే పద్మావతి యింటికి వెళ్ళిపోయింది. స్త్రీల విషయంలో పద్మావతి అంత జాలి చూపించటం లేదని ఆనాటినుండి పద్మావతి పైన అంత జాలి చూపించటం లేదు. కొంచెం ద్వేషంగా మారుతూ వచ్చింది. పద్మావతి చాలా కఠిన హృదయురాలు అనింది. ఇలాంటి పద్మావతి జయదేవునికి తగిన భార్యయేనా? నిజంగా ఈమెలో యిటువంటి పతివ్రతా శక్తి వుందా? అని యీ విధమైన ఆలోచనలు బయలు దేరుతూ వచ్చాయి. ఒక వారము జరిగిన తరువాత మహారాజుగారు వేటకై అరణ్యమునకు బయలు దేరారు. ఆ మహారాజునకు జయదేవునకు స్నేహము అధికము. మహారాజు 'జయదేవా! నీవు నా వెంట వస్తే నీ కవిత్వము, నీ పాటలు నన్నెంతో ఉల్లాస పరుస్తాయి. కాలము హాయిగా గడుపుకోవచ్చు. నీవు కూడా నా వెంట రమ్మన్నాడు. సరేనని జయదేవుడు బయలుదేరాడు. ఆ వార్త రాణిగారికి తెలిసింది. అదే సమయమనుకొంది. ఇప్పుడు యీ పద్మావతిని పరీక్ష చేయాలి. చెలికత్తెను పిలిచింది. ఏమో ప్లానులంతా వేసింది. పద్మావతిని తీసుకు రమ్మంది. లేని ప్రేమ సృష్టించుకుంది. ఆ పద్మావతి అటువంటిది యిటువంటిది అని పొగడుతూ వచ్చింది. ఈ విధంగా వర్ణిస్తూ వుండగానే ముందుగానే వేసిన ప్లాను ప్రకారం ఒక చెలికత్తె అరచుకుంటూ లోపలకు వచ్చింది. ఏమిటే అట్లా అరుస్తున్నావని రాణిగారు ప్రశ్నించింది. తల్లీ ఏమి చెప్పుదును అని దొంగ ఏడ్పులు ఏడ్చింది ఆ చెలికత్తె. మహారాజుగారు వేటకు వెళ్ళటం మనకు తెలుసు కదా. అందరితో జయదేవుడు కూడ వెళ్ళాడు. యింక నేనేమి చెప్పగలను.' ఏమి జరిగింది? మహారాజుగారు బాగున్నారా?' అని అడిగింది మహారాణి. 'ఆ మహారాజుగారు క్షేమంగా వున్నారు'. 'కాని యింకేమి?' 'జయదేవుడు మనకు లేడు ఒక పెద్ద పులి వచ్చి జయదేవునిపై బడి మింగివేసింది'. తక్షణమే పద్మావతి ముఖము చూచారు. 'పద్మావతీ! నీకు ఎలాంటి పరిస్థితి సంభవించిదమ్మా అంటూ రాణి ఆప్యాయంగా యేడ్చింది. పద్మావతి కూర్చున్నట్లుగానే ప్రాణం విడచింది. చూచేటప్పటికి ప్రాణం లేదు. చెలికత్తెలు, రాణిగారు భయభ్రాంతులయ్యారు.

(2) పరీక్ష కోసమని నేను ప్రయత్నం చేస్తే యీరకంగా మాకు శిక్ష అయిందని వారు బాధపడుతుండగనే వేటనుండి రాజావారు సాయంకాలం వచ్చారు. రాణిగారు చాలా భయపడిపోతున్నారు. ఈ వార్త ఒక్క క్షణములో పలనే పురమంతా వ్యాపించిపోయింది. రాణిగారు ఏమో చేశారు పద్మావతిని. పరమ భక్తురాలు. ఆ జయదేవుడు వస్తే యేమవుతుందోనని ఆడవారు మగవారు అంతా గుసగుసలాడుతూ వచ్చారు. చాలా బాధపడుతూ వున్నారు. వచ్చాడు జయదేవుడు. పద్మావతిని చూచాడు. రాజుగారు రాణిగారిపైన కన్నెర్ర చేశాడు ఏమైందని సత్యము చెప్పమని కోపంగా ఉద్రేకంగా అడిగాడు. రాణి రాజుగారి పాదములపైబడి జరిగినదంతా చెప్పింది. జయదేవుని చూచాడు మహారాజు. మహారాజు కూడను కంటిధారలు కార్చాడు. ఇంత పరమ భక్తురాలికి యిలాంటి పరిస్థితి జరిగింది యిది నా భార్యదోషమని విచారించాడు. జయదేవుడు ముందు యేవిధమైన ఆనంద

మతో చిరునవ్వులతో వుండినాడో అదే విధముగనే యీ dead bodyని చూచినప్పుడు అదే చిరునవ్వు ప్రదర్శించాడు జనన మరణములు దేహమునకు సహజములు. ఇది ఒకరివల్ల జరిగేది కాదు. ఎవరు కర్త కాదు. కృష్ణుడే సర్వమునకు కర్త. భోక్త. లోక సంబంధమైన క్రియలకు కర్త కర్మక్రియలు వేరువేరుగా వుండ వచ్చును. మరణమునకు కర్త భగవంతుడే. కర్మ భగవంతుడే. క్రియ భగవంతుడే. అన్నీ అతని సంకల్పములే. ఇచ్చిన వాడూ అతనే పుచ్చుకున్న వాడూ అతనే. వచ్చిన చోటుకే వెళ్ళింది పద్మ. ఈ విధమైన అంత్య పాట వ్రాస్తూ వున్నాడు. మహారాజు చూచాడు. కేవలము మాటల వల్లనే కాదు క్రియల వల్లను యదార్థము నిరూపిస్తున్నాడు జయదేవుడు అని అనుకున్నాడు. ఇతడు మనస్సేకం, వచస్సేకం, కర్మణ్యేకం మహాత్ముడు. ఇతని కంటె మహాత్ముడు వున్నాడా అని జయదేవుని వర్ణిస్తూ వచ్చాడు. జయదేవునకు స్వార్థముగాని, ఫలాపేక్షగాని, అహంకారముగాని ఎక్కడ చూచినా లేవు అతనిలో. ఎక్కడ అహంకారమో అక్కడ ఆడంబరము. ఎక్కడ ఆడంబరమో అక్కడే అశాంతి. అతనికి అహంకారమే లేదు. ఆడంబరము అంతకంటె లేదు. అశాంతి అతనికేసి చూడదు. అతనికి చాలా దూరం. కృష్ణా నీ జయదేవా! పద్మావతి బ్రతికి వుంటే ఎంత ఆనందించేదని మహారాజు లక్ష్మణసేనుడు ఆపాటను మరొక మారు గానము చేయుచున్నాడు. ఆపాటలో వుండిన అంతరార్థమేమనగా 'పద్మావతీ! జీవితము ఒక ప్రవాహము ఈ ప్రవాహములో నీవు నేను అనే రెండు కట్టెలు కొట్టుకొని వచ్చాయి. కొంతకాలము యీ ప్రవాహములో రెండూ కలిశాయి. తిరిగి దేనికది వదలిపెట్టి పోతున్నాయి. ఇది ప్రవాహము యొక్క సహజ గుణము. కలిసినాము గానీ తిరిగి కలవటము దుర్లభము. అని యీ పాట పాడుతూ దుర్లభమని కట్టకడపటి పదము చెప్పేటప్పటికి కన్నులు మూసుకుంటూ లేచింది పద్మావతి. ఆ దృశ్యాన్ని చూచాడు లక్ష్మణసేనుడు. ఆహా యింతకంటె భగవత్ దృశ్యము కావలెనా! భక్తికి భగవంతుడు లోబడతాడు. అందువలనే భగవంతునికి భక్తపరాధీనుడని పేరు. భక్తపరాధీనా! యీ జయదేవుని హృదయము ఎంత నిర్మలము. ఎంత నిస్వార్థము. యిలాంటి పరమ భక్తులు యీ జగత్తులో దుర్లభము. సాక్షాత్ జగన్నాథుడు జయదేవుని హృదయములో వుంటున్నాడు. దేహము జయదేవ దేహము. హృదయము జగన్నాథుడు. ఈ దేహము క్షేత్రము. జగన్నాథుడు క్షేత్రజ్ఞుడు.

క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమన్తరం జ్ఞానచక్షుషా.
భూతప్రకృతి మోక్షం చ యే విదుర్యాన్తి తే పరమ్.

ఈ భగవద్గీత సారాంశమును మహారాజు గానము చేశాడు. వారిద్దరిని అత్యంత వైభవముగా ఒక ప్రొసెషన్ తో తీసుకొని పోయారు రాజుగారు రాణిగారు. మా జీవితములో యిలాంటి పరమ భక్తులను సేవించే ప్రాప్తి మాకు దక్కిందని ఆనందించారు.

ఈ విధంగా జయదేవుని చరిత్ర, గానము వ్యాప్తి చెందాయి. వంగదేశములో ఒక రాజు వుండేవాడు. ఆ రాజు కూడను గొప్ప కవియే. అతడు జగన్నాథుని భక్తుడే. జగన్నాథుని భక్తుడు కావటం చేత

కొన్ని పాటలు వ్రాస్తూ వచ్చాడు. ఎక్కడ చూచినా, అతను ఎక్కడకు వెళ్ళినా అడవులకు వెళ్ళినప్పటికిని జయదేవుని అష్టపదులే పాడుతూ వుండేవారు ప్రజలు. ఆ జయదేవుని పాటలే పాడుతున్నారు నేను వ్రాసిన పాటలు ఎవరు పాడటం లేదే అని అతనిలో అసూయ ప్రారంభమైంది. ఒకనాడు మంత్రులను పిలిచాడు. ఒక చక్కని పదము వ్రాసాడు. ఇది చక్కగా వుందా జయదేవుని పదముల వలె వుందా అని ప్రశ్నించాడు. ఆ మంత్రి యే విధమైన భయము లేకుండా వున్న యదార్థము విన్నవించాడు. 'ఏమని చెప్పను మహారాజా! జయదేవుని పాటలు హృదయాన్ని కరగించినట్లు మీ పాటలు కరగించటం లేదు. జయదేవుని మధుర వాక్యములంతా మధురముగా వున్నాయి. మీ పదములు గంభీరముగా వున్నాయి. మాధుర్యముగా లేవు' అన్నాడు. అప్పుడు ఆయన చెప్పాడు. ఫలమివ్వని వృక్షము వలె, రసము లేని ఫలము వలె, పాలివ్వని గోవు వలె, నిత్యసత్యము లేని అనుభూతి నీ వాక్యము! నీ పదాలు రసము లేని ఫలాలన్నాడని మహారాజుకు కోపం వచ్చింది. ఛీ! నేను జగన్నాథుని భక్తుడనే. అతను జగన్నాథుని భక్తుడే. కనుక ఆ జగన్నాథుడే నిర్ణయము చేయాలి. నీవు నేను చేయటం వల్ల ప్రయోజనం లేదన్నాడు. ఈ యిరువురి కట్టలు తీసుకున్నారు. వెళ్లారు. జగన్నాథుని దగ్గర పెట్టారు. ప్రార్థించారు. 'జగన్నాథా! నాగౌరవమును నాకీర్తి ప్రతిష్ఠలను నిలబెట్టాలి' అన్నాడు. ఆ కీర్తి ప్రతిష్ఠల కోసం ప్రార్థించాడు మహారాజా. జయదేవుడు ఆ కీర్తి నాకు అక్కర లేదు. నా హృదయము నిచ్చే పొంగి వికసించిన పరిమళముతో ఉప్పొంగిపోయే ఆనందముతో లిఖించినవి యీ పాటలు'. అని ఇద్దరు అక్కడ పెట్టారు. పెద్ద తాళం వేశారు. బందోబస్తుగా సిపాయిలను పెట్టారు. వచ్చారు. ఏది జగన్నాథుడు అంగీకరిస్తాడోనని వెళ్ళినారు. రెండవ దినము మహా ఆర్భాటముగా మహారాజా చాలా పూవులు, ఫలములు తీసుకు వెళ్లాడు. ఆ తాళము తీసి తలుపులు తెరిచారు. జగన్నాథుని చేతిలో జయదేవుని పుస్తకాలున్నాయి మహారాజు పుస్తకాలు ప్రక్కకు నెట్టివేశాడు.

(3) అప్పుడే మహారాజా తన అహంకారమును చంపుకున్నాడు. భగవంతుడా! వారి వారి నిర్ణయాలు సరికాదు. నీ నిర్ణయము సరియైనది. నేను విషయ వాసనలతో కూడిన వాడను. అతను విషయ వాసనలను అధిగమించినవాడు. నాది దేహాభిమానము. అతనిది ఆత్మాభిమానము. నాది కేవలము భక్తిప్రపత్తులతో కూడినది. అతనిది మధురమైన హృదయముతో చేరినది. మధుర హృదయమే మాధవునికి మహితరుచి. నేను పురుషుడనను కొంటున్నాను. అదే నా అహంకారము. జయదేవుడు అట్లా కాదు. నేను స్త్రీ పురుషుడు కృష్ణుడొక్కడే. ఆ విధంగా అతని చర్యలు చెప్పకూడదుగానీ ... ఎంతెంతో భావించేవాడు. తాను స్త్రీగాను కృష్ణుడు పురుషుడుగాను చిత్రించుకొని ఎంతో ఆనందము ననుభవించేవాడు. పద్మావతిని సోదరిగా భావించేవాడేగానీ భార్యగా భావించలేదు. నేను ఒక్కడే భగవంతుని గానం చేస్తుంటే రాగము లేనిదిగా వుంటుంది. నీవు తాళముగా వుంటున్నావు పద్మావతీ. నేను రాగము నీవు తాళము. యీ రాగ తాళముల చేత

కృష్ణుని ఆనంద పరుష్ణాముని ఎంతో ఆనంద పడేవాడు. ఈ విధముగా భావించుకుంటూ జయదేవుడు నిరంతరము మధుర భక్తి లోపల మాధవునిలో లీనమయ్యేవాడు. ఎట్టి వాంఛలు జయదేవునకు లేవు. ఎట్టి అహంకారము లేదు. స్వార్థమన్నది అతనికి మరింత దూరము. జయ గోవింద. భగవంతునికే జయము గాని మరొకరికి జయము లేదు. భగవంతుడే నిరంతరము విజయుడు. అదే భగవద్గీతలో

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.

ఎక్కడ భగవంతుడున్నాడో అక్కడే విజయము. కేవలము విజయమే కాదు. దృఢమైన ఆనందము. ఊహ ఆనందమే కాదు. భగవంతునిలో లీనమై పోవటం. భగవద్జ్ఞానము లేని హృదయము ఎండిన కట్టెపుల్ల వంటిది.

(4) భక్తి వుండవచ్చును. జయదేవునికి వున్న భక్తి ఎవరికీ లేదు. ఆ విధమైన మధుర భక్తిని యావత్ప్రపంచమునకు చాటి అందరి హృదయాలలో కృష్ణుని ప్రతిష్ఠ చేసి భగవంతుడే సర్వహృదయవాసి అనే సత్యాన్ని లోకానికి చాటాడు జయదేవుడు. అట్టి భక్తులు భారతదేశములో ఎందరో వుంటున్నారు. అట్లనే త్యాగరాజు 'ఎందరో మహాను భావులు అందరికి వందనములు' అన్నాడు. మనలో వున్న అంతో ఇంతో వున్న భక్తిని ఎంతో అహంకారముగా చెప్పుకుంటాం. కానీ జయదేవుడు తన భక్తిని చెప్పేవాడు కాదు. అతని భక్తి త్రికరణ శుద్ధితో కూడినటువంటిది. త్రికరణ శుద్ధియే భగవంతునికి ప్రీతి. తలచటము ఒకటి, చెప్పటము మరొకటి, చేయటం ఇంకొకటి భగవంతునకు ఇష్టము వుండదు. ఈ మూడింటి ఏకత్వమైన ఆత్మతత్వము భగవంతుని ఆకర్షిస్తుంది. కనుక భగవత్ భక్తిని హృదయ పూర్వకముగా అనుభవించి ఆనందించి ఇతరులకు అందించటానికి తగిన ప్రయత్నం చేయాలి. ఒక భక్తి వుంటే యేమైనా సాధించవచ్చు. భక్తి చేత సాధించలేనిది జగత్తులో యేదీ లేదు. B.Sc., B.Com ల కోసం మనం ఎంతో శ్రమ పడుతున్నాము. భగవత్ప్రేమ పొందటానికి మనం యేమి ప్రయత్నం చేస్తున్నాం? ఎంత వరకు మనం పాటు పడుతున్నాం! అలా ఆరాటపడాలి. ఈ విద్యలకు యే విధమైన శ్రమలు, బాధలు పడుతున్నామో దానికంటె మించిన ఆరాటము భక్తి ప్రపత్తులను చెయ్యాలి. ఈ భగవద్భక్తి మనకుంటె సర్వవిద్యలు మన హస్తగతమై పోతాయి. అదే త్యాగరాజు చెప్పాడు. రామా! నీ అనుగ్రహ బలము ఒకటి వుంటే చాలు అన్నిగ్రహములు నా హస్తగతము అన్నాడు. జయదేవుడు కూడా అంతా కృష్ణా! నీ ప్రేమ ఒక్కటి వుంటే చాలు సర్వప్రపంచాన్ని హస్తగతం చేసుకుంటానన్నాడు.

18 వ అధ్యాయములో 15 వ శ్లోకములో తన విశ్వరూపం చూసుకో మన్నాడు కృష్ణుడు భగవద్గీతలో. 'ఈశ్వర స్సర్వ భూతానాం' అన్నాడు. అన్ని భూతములందు నేనే వున్నాను. అందరి హృదయములలో వున్నవాని తెలుసుకోటానికి వీలుకాదు. నా హృదయములో వుంటున్నాడు. అందరి హృదయములలో వున్న భగవంతుడు నీ హృదయములో లేడా ఆ విశ్వాసము మనము పెంచుకొని భగవంతుడు నావెంటనే జంటనే ఇంటనే కంట

412099009

వున్నాడనే భావము దృఢ పరచుకోవాలి. అదే నిజమైన ఆనందము. ఎక్కడో వున్నాడు ఎక్కడో పోతున్నాడని కాదు ఒక్కడా యిక్కడా ఎక్కడా చూచినా ఒక్కడే నా హృదయములో వున్నాడు. దేహము దేవాలయము. ఇది moving temple. ఈ దేహము ఎక్కడ పోతుందో అక్కడంతా వున్నాడు దేవుడు. Temple ఎక్కడో దేవుడక్కడే. ఆ భావాన్ని పిల్లలు దృఢ పరచుకొని యిక్కడే వున్నాడు పుట్టపర్తిలో వున్నాడు యీ భావం వద్దు. మీరు ఎక్కడ వుండినా ఏ పని చేసినా నా వెంటనే వున్నాడు చూస్తున్నాడు స్వామి యోచన చేసుకోవాలి. ఆవిధమైన భావము వుండినప్పుడే ఎట్టి దోషమునకు మనం పాల్పడము. స్వామి పుట్టపర్తిలో వున్నాడంటే యిష్టం వచ్చినట్లు దోషాలంతా చేస్తుంటాం. ఎప్పుడూ నా వెంటనే వున్నాడు నాకంటె జాగ్రత్తగా చూస్తున్నాడు స్వామి నేనైనా కన్నులు మూసుకుంటున్నానుగానీ స్వామి కన్నులు మూసుకోడు. భగవంతుడు ఎక్కడ వున్నాడనుకుంటే నా వెంటనే వున్నాడనుకుంటే వెనకే కాలి శబ్దాలు వినిపిస్తాయి. నేను చేసేది చూస్తున్నాడా భగవంతుడంటే అక్కడ రెండు కన్నులు మాత్రమే కనుపిస్తూ వుంటాయి. నేను చేసే ప్రార్థనలు వింటున్నాడా అంటే చెవులు మాత్రమే వుంటాయి. భగవంతుని తత్వము తెలుసుకోటం కష్టం. ఉన్నవి రెండు కన్నులు కాదు. సహస్రనేత్రాలుంటున్నాయి. జాగ్రత్తతో యీ జ్ఞానంతో భగవద్భక్తిని అభివృద్ధి పరచుకోండి. అప్పుడే యీ భారతదేశానికి సరియైన ఆదర్శమునందించే పౌరులుగా రూపొందుతారు. ఆదర్శ పౌరులుగా తయారు కావాలి. అప్పుడే యీ దేశము తిరిగి మార్పు చెందుతుంది. ఇక్కడ వుండినా ఎక్కడకు వెళ్లినా యీ భావాలు మెదలుతూనే వుండాలి మీ మదిలో కదలుతూనే వుండాలి.

1990 సెప్టెంబరు 12వ తేదీ బుధవారం త్రయీబృందావనంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసము